## క్లుప్తంగా

### స్వచ్ఛతతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యాలయ పరిసరాల్లో పరిశుభ్రతా పనుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

కె.కోటపాడు : వర్షాకాలం కావడంతో పాఠశాలల పరిసరాల్లో పరిశుభ్రతా పనులను ఉపాధ్యాయులు నిర్వహించాలని ఎంఈవోలు సత్యనారాయణ, ప్రసాద్ తెలిపారు. ఎంఈవో కార్యాలయం పరిసరాల్లో ఎదిగిన పిచ్చి మొక్కలను శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులతో కలిసి వీరు తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. పింద్రంగిలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

### పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో సీడీపీఓ మంగతాయారు

రావికమతం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి రోగాలు దరిచేరవని రావికమతం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పీవో మంగతాయరు అన్నారు. స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కేంద్రాల పరిసరాల్లో వున్న పిచ్చి మొక్కలు, చెత్తను తొలగించారు. ప్రీ స్కూల్ పిల్లలతో పెయింటింగ్ వేయించి, యోగ చేయించారు. కార్యక్రమంలో సీడీపీఓ మంగతాయరు, ఏసీడీపీఓ పుష్పదేవి తదితరులు పాల్గొన్నారు.

### గుల్లేపల్లి పాఠశాల హెచ్‌ఎంగా వీరాంజనేయులు



కె.కోటపాడు : గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా ఎన్.వీరాంజనేయులు నియమితులయ్యారు. పాచిలవానిపాలెం పాఠశాల నుంచి ఇటీవల జరిగిన బదిలీలో ఆయన పాఠశాలలో విధులు చేపట్టారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఈ ఏడాది అవార్డును స్వీకరించిన వీరాంజనేయులు గుల్లేపల్లి పాఠశాలకు రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

### అనుమతుల్లేని క్వారీలపై చర్యలు తీసుకోవాలి

రోలుగుంట: మండలంలో అనుమతులు లేకుండా నడుస్తున్న క్వారీలపై అధికారుల జాప్యం వీడాలని చోడవరం జనసేన ఇంచార్జి పి.వి.ఎస్.ఎన్.రాజు డిమాండు చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎటువంటి అధికారిక అనుమతులు లేని క్వారీల నుంచి నిత్యం వందలాది లారీలతో బహిరంగంగానే మెటీరియల్ తరలింపు జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం బాధాకరమన్నారు. క్వారీ యజమానులు చేస్తున్న అక్రమాలకు అండగా ఉంటూ వారి నుంచి అనునిత్యం డబ్బులు వసూలు చేస్తున్న రాజకీయ నాయకులు, అధికారులకు సంబంధించిన వివరాలను త్వరలోనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు.

### విరివిగా రోటరీ క్లబ్ సేవలు



విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు రోటరీ క్లబ్ సీనియర్ అధ్యక్షుడు బీఎస్ గుప్తా తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ ఫంక్షన్ హాల్లో శుక్రవారం రాత్రి క్లబ్ చార్టర్ నైట్ డే వేడుకలను పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది క్లబ్ ఆధ్వర్యంలో 30 మంది మహిళలకు అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. ఒక్కొక్క కుట్టు మిషన్‌కు రూ.25 వేలు ఖర్చు అయిందన్నారు. గవరపాలెం హిందు శ్మశాన వాటికకు రూ.కోటి విలువ చేసే క్రిమేషన్ మిషన్ అందజేశామని, గాంధీనగరం బీసీ వసతి మహిళా కళాశాల విద్యార్థినులకు రూ.1.50 లక్షల విలువ చేసే పరుపులు వితరణగా అందించామన్నారు. అనంతరం విశాఖ నుంచి వచ్చిన క్లబ్ ఫాస్ట్ అధ్యక్షుడు పి.డి.జి. విశ్వనాథ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అనకాపల్లి క్లబ్ అధ్యక్షుడు సరిపల్లి రాజేష్, కార్యదర్శి దేవత అనిల్, సీనియర్ సభ్యులు కడిమిశెట్టి సతీష్, కె.ఎల్.కుమార్, బుద్ధ రమణాజీ, బుద్ధ సత్యనారాయణ పాల్గొన్నారు.



వెదుళ్లగెడ్డపై వంతెన నిర్మించే ప్రదేశం ఇదే



రోడ్డు కన్పించకుండా ప్రవహిస్తున్న వెదుళ్లగెడ్డ (ఫైల్)

# రోడ్డు సరే... వంతెన నిర్మాణమెప్పుడో?

- నర్సీపట్నం, తుని మధ్య వెదుళ్లగెడ్డపై వంతెన సమస్య
- తాండవ ఉప్పొంగితే రాకపోకలు బంద్
- గత ప్రభుత్వంలో మంజూరైన వంతెన
- కాంట్రాక్టర్ నిర్వాకంతో జరగని పనులు
- రోడ్డు విస్తరణ చేసి వంతెన పనులు మరిచిన కూటమి ప్రభుత్వం



నర్సీపట్నం, తుని మధ్య రోడ్డుపై నీటి ఉధృతిని పరిశీలిస్తున్న అప్పటి ఎమ్మెల్యే గణేష్ (ఫైల్)

నాతవరం : ఆర్భాటంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.. కానీ వంతెన నిర్మాణం పనులు మరిచారు. ఈ రోడ్డు పనులకు స్వయంగా అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్నపాత్రుడు, కలెక్టరు విజయకృష్ణన్ గత ఏడాది నవంబరులో భూమి పూజ చేశారు. మండలంలో నర్సీపట్నం, తుని మధ్య గన్నవరం మెట్ట వద్ద అర్అండ్‌బీ రోడ్డుపై వెదుళ్లగెడ్డ ప్రతి ఏటా వర్షాలు సమయంలో ఉప్పొంగి ప్రవహిస్తుంటుంది. ఈ నీటి ప్రవాహం కారణంగా వాహనాల రాకపోకలు స్తంభించిపోతాయి. గతంలో గన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డ నీటి ఉధృతికి అనేక మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి. గత వైఎస్సార్‌సీపీ హయాంలో అర్అండ్‌బీ రోడ్డుపై వెద్రిగెడ్డ నీటి ప్రవాహన్ని అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్వయంగా పరిశీలించారు. రోడ్డుపై వెదుళ్లగెడ్డ నీటి ప్రవాహంతో ఈ చుట్టు గ్రామాలైన వై.బి.అగ్రహారం, గన్నవరం మెట్ట నీటి ముంపునకు గురికావడం, తద్వారా ఈ ప్రాంతీయుల బాధలు ఆయన స్వయంగా చూశారు. ఈ సమస్యను అప్పటి సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో గన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డపై వంతెన నిర్మాణం, శృంగవరం నుంచి 4 కిలోమీటర్లు కాకినాడ జిల్లా సరిహద్దు వరకు రోడ్డు విస్తరణ కోసం రూ.14 కోట్లు మంజూరు చేశారు. ఆ నిధులతో అప్పటి ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ శంకుస్థాపన చేశారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఎ.శరభవరం, శృంగవరం మధ్య భూమి సేకరణ కూడా చేశారు. పనులు ప్రారంభించి పూర్తి చేయకుండా బిల్లులు రావంటూ సాకు చెప్పి అప్పటి కాంట్రాక్టరు టీడీపీకి చెందిన వారు కావడంతో వైఎస్సార్‌సీపీకి మంచి పేరు వస్తుందన్న ఉద్దేశ్యంతో కాలయాపన చేసేసారు. ఆ పనులను మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రీశాంక్షన్ చేశామంటూ గత ఏడాది నవంబరులో ఈ రోడ్డుకు స్పీకరు అయ్యన్నపాత్రుడు కలెక్టరు విజయకృష్ణన్ స్వయంగా భూమి పూజ చేశారు. అసంపూర్తి నిర్మాణంతో ఉన్న శృంగవరం నుంచి జిల్లా సరిహద్దు మధ్య అర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులు చేశారు. ఈ రోడ్డు మధ్యలో గన్నవరం మెట్ట వద్ద వెదుళ్లగెడ్డపై వంతెన నిర్మాణం ఊసే మరిచారు. భూమి పూజ చేసి 8 నెలలు అవుతున్నా వంతెన పనుల ఊసెత్తలేదు. స్పీకరు, కలెక్టరు స్వయంగా భూమి పూజ చేసిన పనులు కావడంతో యుద్ధ ప్రాతిపదికన వంతెన నిర్మాణం చేస్తారు..బ్రిటిష్ కాలం నుంచి వెంటాడుతున్న సమస్య తీరుతుందని ఈ ప్రాంత ప్రజలు ఆశించారు. కానీ కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఈఏడాది కూడా వర్షాలు తుపానుల సమయంలో వెదుళ్లగెడ్డ నీటి కష్టాలు తప్పేటట్టు లేవని ఆవేదన చెందుతున్నారు. తాండవ ప్రాజెక్టు నుంచి స్పిల్‌వే గేట్లు ఎత్తినా, భారీ వర్షాలు కురిసినా, తుపానులు సంభవించినా వెదుళ్లగెడ్డ రోడ్డుపై ఉప్పొంగి ప్రవహిస్తుంది. నీటి ఉధృతి తగ్గేంత వరకు రెండు జిల్లాల మధ్య రాకపోకలు రాత్రి పగలు సైతం గంటలు తరబడి నిలిచిపోతాయి.రాత్రి వేళల్లో కొత్తగా వచ్చే వాహనదారులకు నీటి ఉధృతి తెలియక దిగేయడంతో అనేక మంది కొట్టుకుపోయన సందర్భాలుఉన్నాయి. తుఫాను వేళల్లో అధికారులు వెదుళ్లగెడ్డ వద్ద కాపలా పెట్టి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపడతుంటారు.



గత ఏడాది రోడ్డు వంతెన పనులకు భూమి పూజ చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టరు (ఫైల్)

### ఆర్భాటమే తప్ప ఆచరణ ఏదీ...



కూటమి ప్రభుత్వం ఆర్భాటమే తప్ప దానికి తగట్టుగా పనులు చేయడం లేదు. మమ్మల్ని విమర్శించారు.. ఇపుడు మీరు చేసిందేమిటి. వంతెన నిర్మాణం జాడ ఎక్కడా కన్పించలేదు. స్పీకరు అయ్యన్నపాత్రుడు, కలెక్టరు విజయకృష్ణన్ స్వయంగా భూమిపూజ చేసిన పనులు నెలలు గడుస్తున్నా పని కాలేదు, దీని దుస్థితి చూస్తే కూటమి ప్రభుత్వం పని తీరు ఏమిటనేది కచ్చితంగా అన్ని వర్గాల ప్రజలు గమనిస్తుంటారు.

– సాగిన లక్ష్మణమూర్తి ఎంపీపీ నాతవరం మండలం

### వంతెన పనులకు సమయం పడుతుంది



ముందు రోడ్డు విస్తరణ పూర్తి చేశాం. వెదుళ్లగెడ్డపై వంతెన నిర్మాణం కొంత సమయం పడుతుంది. బిల్లులు చెల్లింపులు చేయడంలో జాప్యం కావడంతో సమస్య వస్తుంది. వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయడానికి వచ్చే ఏడాది 2026 డిసెంబరు వరకు కాంట్రాక్టరుకు సమయం ఉంది.

– నారాయణరెడ్డి, జేఈ, ఆర్అండ్‌బీ శాఖ

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ



నానాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

నాతవరం : వైఎస్సార్‌సీపీ కార్యకర్త పప్పల నానాజీ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ అన్నారు. మండలంలో పి.జగ్గంపేట గ్రామానికి చెందిన నానాజీ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. శనివారం ఉమా శంకర్ గణేష్ నానాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించి కటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గునుపూడి సర్పంచ్ వేముల సూర్యనారాయణ పి.కె.గూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అచ్చేర్ల వరహాలబాబు, పార్టీ జిల్లా నాయకుడు సూరిబాబు పాల్గొన్నారు.

### అసనగిరిలో వైద్య శిబిరం ఏర్పాటు



అసనగిరిలో వైద్యసేవలు అందిస్తున్న నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: విషాహారం తిని అస్వస్థతకు గురైన అసనగిరి గ్రామస్తులంతా కోలుకున్నారని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. మండలంలో గిరిజన ప్రాంతమైన సుందరకోట పంచాయతీ శివారు అసనగిరి గ్రామంలో శనివారం వైద్యాధికారి ప్రసన్న తన సిబ్బందితో వెళ్లి వైద్య శిబిరం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి 98 మంది గిరిజనులను పరీక్షించి మందులు అందజేశారు. ఇటీవల ఈ గ్రామం నుంచి కొందరు పాడేరు మోదకొండమ్మ దర్శనానికి వెళ్లి కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన విషయం విదితమే. మూడు రోజుల పాటు ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొంది గిరిజనులు కోలుకుని స్వగ్రామం చేరుకున్నారు. వారికి సకాలంలో వైద్య సేవలు కల్పించిన స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన పెద్దలు, వైద్యాధికారులు, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## వాసవీక్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం



ఆస్పత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మాడుగుల రూరల్ : అంతర్జాతీయ వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జూన్ మాసంలో నిర్వహించే డాన్ టు డస్క్ కార్యక్రమం శనివారం ఉత్సాహంగా మండలంలో నిర్వహించారు. వాసవీ క్లబ్, వనితక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలోమాడుగుల వాసవీ క్లబ్ అధ్యక్షుడు కొట్యాడ రమేష్ అధ్యక్షతన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయంలో సమావేశం నిర్వహించారు. స్వామివారిని దర్శించుకున్నారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు, సిబ్బందికి పండ్లు, రొట్టెలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంతర్జాతీయ వాసవీక్లబ్ అదనపు కోశాధికారి రామయ్య, కార్యక్రమం పరిశీలకుడు అంతర్జాతీయ వాసవీక్లబ్ పోగ్రాం సమన్వయకర్త రమణమూర్తి, రీజన్ చైర్మన్ నానాజీ, జోన్ చైర్మన్ మాధవి, వనితా క్లబ్ అధ్యక్షురాలు రాధిక, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## బుచ్చెయ్యపేట ఎంపీడీవోగా భానోజీ

బుచ్చెయ్యపేట : మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా భానోజీరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి ఈ నెల 14న బాత్‌రూంలో తల తిరిగి పడిపోగా కోమాలోకి వెళ్లి 18వ తేదీన మృతి చెందారు. దీంతో రావికమతం మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న భానోజీరావును బుచ్చెయ్యపేట మండల ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. ఇక్కడ ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మికి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించిన ఆమె చేయలేనని పై అధికార్లుకు నివేదించారు. దీంతో రావికమతం ఈవోపీఆర్డీకి బుచ్చెయ్యపేట అదనపు ఎంపీడీవోగా నియమించడంతో ఆయన శనివారం బాధ్యతలు స్వీకరించారు.



విధుల్లో చేరిన ఎంపీడీవో భానోజీరావు

## యువత పోరును విజయవంతం చేయండి

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్




యువత పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువత పోరు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయా విభాగాల నాయకులతో కలిసి యువత పోరు పోస్టర్లను మాజీ ఎమ్మెల్యే గణేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ప్రకటించారన్నారు. యువత కోసం ఏటా 5 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఉద్యోగాలు లేవు..నిరుద్యోగ భృతి లేదన్నారు. కొత్తగా ఉద్యోగాల కల్పన లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటం చేయడంతో అరకొరగా తల్లికి వందనం నిధులు ఇచ్చారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు యువత పోరు నిర్వహిస్తున్నామన్నారు. ఫీజు బకాయిలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు. మహిళలకు రూ.1500, అన్నదాత సుఖీభవ రూ.20 వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ.4 వేలు పెన్షన్ ఇస్తామని ఈ ప్రభుత్వం అన్ని వర్గాలను దగా చేసిందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ అధ్యక్షులు తమరాన శ్రీనివాసరావు, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కిల్లాడ శ్రీనివాసరావు, నాలుగు మండలాలు, మున్సిపాలిటీ యూత్ అధ్యక్షులు అల్లంపల్లి ఈశ్వరరావు, దన్నిన నానాజీ, మాకిరెడ్డి రామకృష్ణంనాయుడు, రుత్తల రాజు, బండారు పైడియ్యనాయుడు, విద్యార్థి విభాగం అధ్యక్షులు పూణ్యవతుల స్వామి, మేరిశెట్టి అప్పలనాయుడు, మాకిరెడ్డి నరేంద్ర, రేవు రాధాకృష్ణ, రుత్తల వంశీ, యువత పాల్గొన్నారు.

### చెరువును తలపిస్తున్న బీఎన్ రోడ్డు

రావికమతం : మండలంలో మేడివాడ నుంచి గరినకం వరకు ఉన్న బీఎన్ రోడ్డు చెరువును తలపిస్తోంది. మేడివాడ వద్ద భారీ గోతులో శనివారం ట్రాక్టర్ కూరుకుపోవడంతో గంటకు పైగా ట్రాఫిక్‌ కు అంతరాయం కలిగింది. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాంటే వాహనదారులు తరుచూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే రోడ్డులు వేస్తామని చోడవరం ఎమ్మెల్యే రాజు,అనకాపల్లి ఎంపీ రమేష్ హామీ ఇచ్చారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం పూర్తి అయ్యింది. అయినా రోడ్డు పరిస్థితి మారలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ఎమ్మెల్యే రాజు స్పందించి తక్షణమే రోడ్డు పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



మేడివాడ వద్ద బీఎన్ రోడ్డులో కూరుకుపోయిన ట్రాక్టర్

# ఘనంగా యోగా దినోత్సవం



నర్సీపట్నంలో యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాల ప్రదర్శన

నర్సీపట్నం/నాతవరం/గొలుగొండ/మాకవరపాలెం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పురపాలిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో శనివారం యోగా డే నిర్వహించారు. వివిధ క్లబ్‌ల సభ్యులు, విద్యార్థులు, రెవెన్యూ, మున్సిపల్‌శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. జీవనశైలిలో యోగాను భాగస్వామ్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాయని మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర పేర్కొన్నారు. ఎక్సైజ్ సిబ్బంది యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. సీఐ కె.సునీల్‌కుమార్, సిబ్బంది యోగాసనాలు వేసి, యోగా డేను ఘనంగా నిర్వహించారు. నాతవరంలో జరిగిన యోగా కార్యక్రమంలో నేషనల్ హెల్త్ మిషన్ జిల్లా పోగ్రామ్ మేనేజ్‌మెంటు అధికారి నేతల ప్రశాంతి, తహసీల్దార్ వరహాలబాబు పాల్గొన్నారు. గొలుగొండ మండలంలో అన్ని గ్రామ సచివాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, అటవీశాఖ కార్యాలయం వద్ద రేంజర్ శ్రీనివాసరావు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలో మాకవరపాలెం, పీపీ అగ్రహారం, తూటిపాల, జెడ్.గంగవరం, నారాయణరాజుపేట, బూరుగుపాలెం, తదితర గ్రామాల్లో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. ఎంపీపీ సర్వేశ్వరరావు, ఎంపీడీవో చాయాసుధ, డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పాల్గొన్నారు.

మాడుగుల/మాడుగుల రూరల్/కె.కోటపాడు/దేవరాపల్లి : నియోజకవర్గ కేంద్రం మాడుగుల కోట ప్రాంగణంలో శనివారం ఎంపీడీవో కొంకి అప్పారావు యోగ దినోత్సవం నిర్వహించారు. అధికారులు, ప్రజలు, యోగసాధన చేశారు. పశువైద్యశాఖ ఏడీ వి.చిట్టినాయుడు ఆధ్వర్యంలో యోగసనాలు వేశారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం యోగా దినోత్సవం నిర్వహించారు. వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు ప్రభాకర్‌రావు సన్మానించారు. పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలును పంపిణీ చేశారు. కె.కోటపాడు మండలంలో మండల విద్యాశాఖాధికారులు కె.సత్యనారాయణ, డీవీడీ ప్రసాద్ సిబ్బంది, ఉపాధ్యాయులతో కలిసి యోగాసనాలు వేశారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ భుజంగరావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, లంకవానిపాలెం పీహెచ్‌సీలో వైద్యాధికారి శైలజ పర్యవేక్షణలో యోగాసనాలు వేశారు. దేవరాపల్లిలో తహసీల్దార్ లక్ష్మీదేవి శనివారం రెవెన్యూ సిబ్బందితో కలిసి యోగ సాధన చేశారు. పీహెచ్‌సీలో వైద్యాధికారులు ఈ.పూజ్య మేఘన, వనజ స్థానిక వైద్య సిబ్బందితో కలిసి యోగాసనాలు వేశారు. బోయిలకింతాడలో సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు విద్యార్థులు, అధికారులతో కలిసి యోగ సాధన చేశారు. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుజాత ఆధ్వర్యంలో విద్యార్థులు అబ్బుర పరిచే యోగాసనాలు వేశారు. యోగా ప్రయోజనాల ను వివరిస్తూ కాశీపురం ఎంఎల్‌హెచ్‌పి సంధ్య తయారు చేసిన నమూనా అబ్బుర పరిచింది.

బుచ్చెయ్యపేట/రోలుగుంట/రావికమతం: చోడవరం నియోజకవర్గంలో యోగ డేను ఘనంగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ లక్ష్మి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. మేజర్ పంచాయతీ వడ్డాది ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు రమ్యదుర్గ,ఎల్‌టీ శ్రీనుబాబు ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఆస్పత్రిలో యోగాసనాలు వేశారు. రోలుగుంట మండలంలో పాఠశాలలు, ఎంపీడీవో కార్యాలయంలోను 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. జెడ్పీటీసీ లక్ష్మీరమణమ్మ పాల్గొన్నారు.రావికమతంలో ఎంపీడీవో వెంకన్నబాబు ఆధ్వర్యంలో సచివాలయం వద్ద ఐసీడీఎస్, పంచాయతీ కార్యదర్శులు,అంగన్‌వాడీ,సచివాలయ సిబ్బంది యోగాచేశారు.



రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు




మాడుగులలో యోగాసనాలు నిర్వహిస్తున్న దృశ్యం



మాకవరపాలెంలో యోగా సింబల్ ఆకృతిలో బూరుగుపాలెం విద్యార్థులు

## ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఎస్‌బీఐ ఉద్యోగులు

అనకాపల్లి: ఆరోగ్య వంతులైన యువతీ యువకులు ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయడం వల్లఆపదో ఉన్న మరో ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనకాపల్లి యూనియన్ రీజనల్ కార్యదర్శి పైలా ప్రసాద్ తెలిపారు. స్థానిక మెయిన్‌రోడ్డు ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఆవరణలో బ్యాంక్ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి ఆదేశాలు మేరకు బ్రాంచ్ 70 వసంతాలను పురస్కరించుకుని అమరావతి సర్కిల్, రాజమహేంద్రవరం మాడ్యూల్, అనకాపల్లి బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మెగా ఉచిత రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యవంతులైన 18 నుంచి 60 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదానం చేసిన వ్యక్తికి రెండు, మూడు రోజుల్లో కొత్త రక్తం శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. సృష్టిలో రక్తం దొరకదని, ఒక వ్యక్తి నుంచి మరో వ్యక్తికి రక్తదానం ఎంతో అవసరమన్నారు. గతంలో పురుషులు మాత్రమే రక్తదానం చేసేవారన్నారు. ఇటీవల కాలంలో మహిళలు రక్తదానం చేయడం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. సుమారుగా 60 మంది బ్యాంక్ ఉద్యోగులు రక్తదానం చేశారు. ఈ రక్తాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి రక్తనిధి సిబ్బంది సేకరించారు. కార్యక్రమంలో అనకాపల్లి రీజియన్ బ్యాంక్ సీఎం ఆపరేషన్ సంజయ్, హెచ్ఆర్ మేనేజర్ మధుబాబు, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ ఈశ్వరి, ఎస్‌బీఐ యూనియన్ నాయకులు నరేష్, మహేష్, అసోసియేషన్ నాయకుడు రామకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

### వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు

కశింకోట: నరసింగబిల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి నూతన సొబగులు అద్దుతున్నారు. దాతలు సమకూర్చిన రూ.6 లక్షల విరాళంతో ఆలయంపై విష్ణుమూర్తి దశావతారాల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.